
# కార్తీక దీపాలు



సత్యం శంకరమంచి

నాకు శీతాకాలం చిరుచలి అంటే బలేఇష్టం. చలేకాదు ఆ చలిలో చన్నీళ్ల స్నానం చేయటమన్నా, ఆ మంచులో పరుగెత్తి గుళ్లో పున్నాగ చెట్లకింద పువ్వు లేరటమన్నా, గుడి మంటపంలో కూర్చున్న జంగం తాత శంఖం లాక్కుని బుగ్గలు మంట పుట్టేదాకా వూదటమన్నా, ఆచార్లుగారికి తెలియకుండా రెండో చేతిలో కూడా దధ్యోజనం పెట్టించుకోవడ



మన్నా, మా నాయనమ్మచేత తిట్లు తినటమన్నా చిన్నప్పుడు బలే సరదాగే వుండేది. నాయనమ్మంటే అసలు నాయనమ్మకాదు. మా నాన్నకు దగ్గరి చుట్టరికం. నన్ను నాలుగేళ్ళప్పుడు తీసుకెళ్ళి పదేళ్ళు వచ్చేదాకా పెంచుకుంది. ఆ తర్వాత మానాన్న స్కూల్లో చేర్పించటానికి నన్ను పట్నం తీసుకొచ్చేశాడు.

నాయనమ్మ మధ్యమధ్య పట్నంవచ్చి నన్ను తెగవేధించేది, వాళ్ల వూరు రమ్మని. నాకూ వెళ్ళాలనే ఉండేది. ఎంచేతో వెళ్ళటం మాత్రం పడింది కాదు. అకస్మాత్తుగా మాచెల్లి పెళ్లికి లగ్నాలు పెట్టుకోవడంతో నాయనమ్మని తీసుకరావటానికి, మళ్ళీ పదేళ్ల తర్వాత ఆ వూరెళ్ళాను. చిన్నప్పుడు తెగతిరుగుతూ ఆడుకున్న ఊరయినా, ఆ వీధులూ, ఇళ్ళూ కొంచెం కొత్త కొత్తగా ఉన్నాయి. కొన్ని మార్పులు కన్పించినై, గాలి గోపురం, కోటదిబ్బ ఆదిబ్బ మీద కొమ్మలు కలుపుకుని

మెలేసుకున్న రెండువేపచెట్లు, ఆ చెట్ల పక్కనే సగంకట్టి ఆపేసిన రథశాల. ఏమార్పులేకుండా అలాగేవున్నాయి. గాలిగోపురంలో దేవుణ్ణి వూరేగించే చిన్నరథంఉంది. దాని చుట్టూచుట్టూ బుల్లిబుల్లి చిలకలు చెక్కారు. చిన్నప్పుడు ఆడుకుంటూ కొంటెతనానికి ఆ చిలకముక్కులు రాళ్లతో విరగ్గొట్టి ఇళ్ళకు తీసుకుపోయేవాళ్ళం. వస్తూ వస్తూ సరదాగా గాలి గోపురంలోకి తొంగిచూశాను. చిలకముక్కు లన్నీ విరగ్గొట్టే ఉన్నాయి. 'ఇప్పుడు పిల్లలకి విరగ్గొట్టడాని కేంలేవే పాపం! అనిపించింది'. ఇంకా నయం మేం చిలక ముక్కుల్తో పోనిచ్చాం పిల్లు రథాలే విరగ్గొడు తున్నారేమో' అని నవ్వుకుంటూ వచ్చాను.

నాయనమ్మ నన్ను చూసి పొంగిపోయింది. పక్కవీధినుంచి పెరుగు తెప్పించింది. పొద్దుపోయేదాకా ఏవో కబుర్లు చెప్తోంది. ఎక్కువగా నాచిన్ననాటి కబుర్లే. నేనొకసారి ఎవరింటి ముందో అప్పడాలు ఎండబెట్టుకుంటే నా కొకటిమ్మని అడిగానట. వాళ్లు ఒక్కటిచ్చారుట. మా నాయనమ్మకి ఇంకోటిమ్మనానుట. వాళ్లు ఇవ్వంఫో అన్నారట. వాళ్ళని ఇంట్లోకి పోనిచ్చి నేను ఆ అప్పడాలన్నీ పోగుచేసి ముక్కలుగా తొక్కి వచ్చానట. నేను చిన్నప్డుడు ఆవిడంటే ఎంత అభిమానంగా ఉండేవాణ్ణో చెప్పటానికి ఆ కథ చెప్తుంది, నాయనమ్మ. ఆ కథ నాకిప్పుడు వింటుంటే కొంచెం కష్టంవేసి సిగ్గుపడ్డాను.

తెలతెల్లవారు జామునే మెళుకువ వచ్చింది. నాయనమ్మ నాకంటేముందే లేచి తాటాకుబుట్ట సర్దుకుని బయల్దేరు తోంది.

'ఎక్కడికి నాయనమ్మా కార్తీక స్నానానికేనా?' అన్నాను.

'అవున్రా' అంది. డెబ్భైయో పడిలో ఆవిడకున్న ఓపికకి ఆశ్చర్యపోయాను.

'నేగూడా వస్తా నాయనమ్మా' అన్నాను.

'నువ్వేం ముకురా. అసలే చలి' అంది

'ఇంతపెద్దదానివి, నీకులేని చలి నాకా' అన్నాను.

'చిన్నప్పుడుకూడా ఇట్లాగే వెంటపడేవాడివి. రా' అంది నాయనమ్మ.

చిన్నప్పుడు కార్తీకమాసం నెల రోజులూ నేనూ నాయనమ్మతో కృష్ణ ఒడ్డుకి వెళ్ళేవాణ్ణి. వెళ్తూ ఒకరగ్గు తీసికెళ్ళేవాణ్ణి నేనొక్కణ్ణే కాదు వీధి చివర జానకిని కూడా పిల్చుకెళ్ళేవాణ్ణి. జానకీ వాళ్ళమ్మకూడా కార్తీక స్నానాల కొచ్చేది.

'నాయనమ్మా! జానకి ఇప్పుడెక్కడుంది? అన్నాను.

'ఎక్కడుండట మేవిట్రా! ఈ వూరేగా దాన్నిచ్చారు. దాని మొగుడిది పక్కవీధిలో ఇల్లు. దానికిద్దరు పిల్లలు పండ్లల్లే ఉంటారు. అదికూడా ఈపాటికి కృష్ణకు వెళ్ళేవుంటుంది. అది అసలు మనింటికి రావాల్సిన పిల్ల కాదూ, నేనెంత పోరినా మీనాన్న వింటేనా' అంది.

నాయనమ్మ వచ్చినప్పుడల్లా జానకిని చేసుకోమని నాన్నకి చెప్తుండేది. నాన్న నాచదువై తేగాని పెళ్లిమాట తలపెట్టనన్నాడు. నాతో చెప్పేది. నేనేమీ చెప్పకుండా వెళ్లిపోయే వాణ్ణి. ఆరోజుల్లో నాయనమ్మ, జానకీ వాళ్లమ్మ స్నానాలుచేసి ఒడ్డునున్న బండరాళ్ళమీద దీపారాధనలు చేస్తుంటే. నేనూ, జానకీ ఇంకో బండరాయిమీద కూర్చుని చూస్తూ ఉండేవాళ్లం. వాళ్లకు కావల్సినవి తాటాకు బుట్టల్లోంచి తీసి ఇస్తుండేవాళ్లం. నేను జానకి చుట్టూకూడా రగ్గు కప్పేవాణ్ణి వాళ్లు దీపాలు వెలిగించుకుంటుంటే మేము రగ్గులో ఒదిగికూర్చుని కథలు చెప్పుకునేవాళ్ళం. దీపాలు కృష్ణలో విడిచిపెట్టే వేళకి, మేము లేచి నీళ్లదగ్గిర కెళ్లేవాళ్లం. నాయనమ్మ వాళ్లు 'ఒడ్డునే ఉండండి. నీళ్ళలోకి దిగకండి'




"....ఈ విరహములో....ఈ నిరాశలో....నీ కోసమె నే జీవించునదీ...."

అని కేకవేసే వాళ్లు. నాయనమ్మ వాళ్లు కొంచెం లోతులోకి వెళ్లి దీపాల్ని నీటిజాలులో విడిచేవాళ్లు. అవి మినుకు మినుకు మంటూ పాట పాడుతున్నట్టు ఊగుతూ పోయేవి.

నాకిప్పటికీ జ్ఞాపకం. ఒకరోజు రేవునుంచి తిరిగొస్తూ నాయనమ్మనడిగాను 'ఆ దీపాలన్నీ ఎక్కడికెళ్తాయి నాయనమ్మా?'

'దేవుడిదగ్గిరి కెళ్తాయిరా' అంది.

'నిజంగా దేవుడి దగ్గిరకెళ్తాయా?' అంది నా పక్కనే ఉన్న జానకి.

'నిజంగానేనే భడవా! దేవుడి దగ్గిరికి కాక ఇంకెక్కడికెళ్తాయే', అంది నాయనమ్మ.

ఆరోజునుంచి కృష్ణలో దీపాలు వదలంగానే ఒడ్డునుంచి చూస్తూంటే

'అదిగో! మా అమ్మదీపం దేవుడి దగ్గిర కెళ్తోంది' అని చప్పట్లు కొట్టేది జానకి.

'అదిగో! మా నాయనమ్మ దీపం కూడా' అని నేనూ చప్పట్లు కొట్టేవాణ్ణి.

దూరంగా జాలులో కొట్టుకు పోయే ఆ దీపాల్ని కంటికి కన్పించే దాకా చూస్తూ నుంచునేవాళ్ళం. 'ఇక పదండర్రా ఇళ్ళకి' అని నాయనమ్మవాళ్లు కేక వేసి తీసికొచ్చేవాళ్లు.

చిన్నప్పటి ఆ సంగతులన్నీ జ్ఞాపకం, వచ్చి చలి జివ్వుమంటున్నా చెంగున గెంతుదామనిపించింది. నాయనమ్మ నేను రేవులోకొచ్చాం. రేవులో ఎప్పట్లాగే రెండు పెద్ద చింతచెట్లు నల్లగా చీకట్లో కలిసిపోయి వున్నాయి. ఆ చెట్లకింద బండరాళ్లు ఆ బండరాళ్లమీద కొందరప్పుడే స్నానాలు చేసివచ్చి దీపాలు పెడ్తున్నారు.

'ఏమేవ్ జానకీ! రంగడొచ్చాడే,' అంది నాయనమ్మ తలవంచుకుని దీపారాధన చేస్తున్న అమ్మాయితో.

జానకి తలెత్తి చూసి 'ఏం రంగా! జ్ఞాపకం ఉన్నానా? అంది. నేనాశ్చర్యపోయాను. జానకి చాలా పెరిగిపోయినట్టుకనిపించింది. జానకి తలారాస్నానం చేసిందేమో, వెంట్రుకల నుండి నీళ్లు జారి బొట్లుబొట్లుగా పడుతున్నాయి. పసుపురాసుకున్న జానకిముఖం దీపం వెలుగులో మెరిసిపోతోంది.

'ఏం రంగా! అట్లాచూస్తావ్, జ్ఞాపకంలేనా?' జానకి రెట్టించి అడిగింది తెల్లబోతున్న నాముఖంలోకి చూస్తూ.

'ఆ.... ఆ.... జ్ఞాపకంలేకేం' నీళ్లు నమిలాను.

జానకి మువ్వలు కుదిలించినట్లు కిలారున నవ్వింది. ఆ నవ్వు ప్రతిధ్వనులు నాలోకి చొరవగా చొచ్చుకు పోయినై. జానకి ఎంత పెద్దదైంది! చిన్నప్పుడు చెవిమెలేసి ఏడిపించేవాణ్ణి. ఇప్పుడు జానకిని చూస్తూంటే నాకంటే జీవితంలో నాలుగడుగులు ముందుకు వేసిన మనిషిని చూస్తూన్నట్టుంది. ఇంతలో 'అమ్మా! అమ్మా! ఎవరే? అంటూ ఇద్దరు పిల్లలు జానకి మీద పడబోతూ అడిగారు.

మీద పడకండి....దూరం... బాబయ్య....దగ్గిరకెళ్లి కూర్చోండి అంది జానకి.

'బాబయ్యా!' అన్నారు ఇద్దరు పిల్లలూ నావైపు కొత్తగాచూస్తూ.

వాళ్లిద్దర్నీ దగ్గిరికి పిలిచి, ముగ్గురం ఒక బండమీద కూర్చున్నాం. ఆపిల్లలిద్దరూ ఏవో కబుర్లు చెపుతున్నారు. మధ్య మధ్య నన్ను 'ఊ కొట్టూ' అంటున్నారు. వాళ్లు తెచ్చుకున్న రగ్గు నాక్కూడా కొంచెం కప్పారు.

అంతలో నాయనమ్మ కూడా స్నానం చేసివచ్చి జానకి పక్కనే దీపారాధన చేస్తోంది. నేను జానకిని తదేకంగా చూస్తూన్నాను, ఉన్నట్టుండి ఒక్కసారి బాధేసింది.

దీపాలు కృష్ణలో విడిచిపెడ్తున్నారు జానకి పిల్లలు, నేను ఒడ్డుకెళ్లి నిల్చున్నాం. కృష్ణమ్మ ముత్యాలహారం వేసికొన్నట్లుగా వందలాది ఆవునేతిదీపాలు కృష్ణమ్మ పఠాన వెలుగుతూ కదిలిపోతున్నాయి. ఆకాశం కృష్ణపైన నక్షత్రాలు వర్షించినట్లుంది. కదిలిపోతున్న దీపాలను చూస్తూ ఒడ్డునున్న జానకి పిల్లలు 'అదిగో' మా అమ్మ దీపం దేవుడిదగ్గిరకెళ్తోంది అంటూ చప్పట్లు కొట్టారు. నాకు పాత సంగతులు జ్ఞాపకంవచ్చినై.

'చూశావా జానకీ! నీ పిల్లలు, అంతా నీపోలికే' అన్నాను.

'అవును నా పోలికలే నువ్వు, నీ పోలికలు రానివ్వలేదుగా' అంది జానకి.

నాకు గుచ్చుకున్నట్లయింది. జానకి బిందెతో నీళ్లు ముంచుకుంటూ 'ఏం రంగా! ఇవ్వాళుంటావా!' అంది.

నేను తేరుకుని 'లేదు వెళ్తానన్నాను.' 'కాదు ఉండమంది' జానకి. నేను ఒప్పుకున్నాను.

సూర్యకిరణాలు మంచుపొరలు చీల్చుకుని బయటికొస్తున్నాయి చింత చెట్లమీద కాకులు చిందరవందరగా అరుస్తున్నాయి. జానకి వంగపండు పట్టుచీర కట్టుకుని, నీళ్ళబిందె నడుంమీద పెట్టుకుని ముందు వెళ్తుంటే, నేనూ నాయనమ్మ వెనకాల నడుస్తున్నాం. నా చేతిలోంచి జారిపోయిన ఆణిముత్యం జిగేలున మెరుస్తున్నట్లయింది.

జానకి వడ్డనచేస్తూ గబగబా మాట్లాడుతున్నా, కావాలని నన్ను గురించి వివరాలు అడుగుతున్నా, నేను పసివాడిలా అయిపోతున్నాను. నా సమాధానాలు బెదురుతూ చెపుతున్నట్టు వస్తున్నాయి.

'నీ చెల్లి పెళ్లికి రావటానికి పడదు గాని నీపెళ్లెప్పుడూ?' అంది జానకి తమలపాకులకు సున్నంరాస్తూ.

నేను సిగ్గుపడిపోయ్యాను. 'ఇప్పుడప్పుడే చేసుకోదల్చుకోలేదు' అన్నాను తల వంచుకుని.

'ఇప్పుడు చేసికోకపోతే పళ్లూడిపోయాక చేసికొంటావా? ఈ పిచ్చి మాటలు తీసెయ్. నువ్వు తొందరగా పెళ్లిచేసుకోవాలి. ఇదుగో ఇటుచూడు .... పెళ్లి చేసికొని యిట్లాంటి రత్నాల్ని కనాలి' అంటూ జానకి తన ఇద్దరి పిల్లల్ని దగ్గిరికి తీసికొని గట్టిగా ముద్దు పెట్టుకుంది. తాంబూలంతో ఎర్రపడ్డ జానకి పెదవులు పిల్లల పాలబుగ్గలమీద

ముద్రలు వేసినై. ఆ దృశ్యం నాకు హాయనిపించింది. చెప్పలేనంత బాధ తోచింది. చెల్లి పెళ్ళికి తప్పకుండా రమ్మని సెలవు తీసికొని వచ్చేశాను.

ఆ తర్వాత జానకి జ్ఞాపకం వచ్చి నప్పుడల్లా మళ్ళీ ఒకసారి నాయనమ్మ ఊరు పోవాలనిపించేది. ఆవూరు వెళ్ళి వచ్చింతర్వాత పెళ్లి చేసికొందా మన్న ఆలోచన నాలో మొలకెత్తింది.. ఒకటి రెండుసార్లు పెళ్లిచూపులకెళ్లాను. పెళ్లిచూపుల సమయంలో ప్రతిసారి నాకు జానకి జ్ఞాపకంవచ్చేది. పోల్చి చూసుకోడం మొదలెట్టేవాణ్ణి. మనస్సు వికలమైపోయి లేచి వచ్చేసే వాడిని.

నా బి. ఏ. పూర్తయింది ఇంట్లో ఆ రాత్రి నాపెళ్లిగురించి నాన్నవాళ్లు ఒత్తిడి చేశారు. నాకుమళ్లీ జానకి జ్ఞాపకం వచ్చింది. మర్నాడు పొద్దున నాయనమ్మని చూసొస్తానని చెప్పి ప్రయాణమయ్యాను.

నాయనమ్మలో ఇంతకు ముందున్న జవం కన్పించటంలేదు. మాట్లాడు తున్నప్పుడు కొంచెం వణుకుతోంది. తెల్లవారు జామున నాయనమ్మ తాటాకు బుట్ట సర్దుకుని బయలుదేరటం చూశాను. అది కార్తీకమాసమని నా కప్పుడు తెలిసింది. సరిగ్గా సమయాని కొచ్చానని సంతోషించాను. 'నేను కూడా వస్తా నాయనమ్మా' అన్నాను.

'చలిలో నువ్వెందుకురా...సరే!రా' అంది యథాప్రకారం నాయనమ్మ.

నాయనమ్మ నడుస్తు చెప్తోంది. 'అసలు ఈ సంవత్సరం స్నానాలు మానేద్దా మనుకున్నాను. కాని ఈ సంవత్సరం నన్ను దాటిస్తుందని నమ్మకం లేదు. అందుకని కష్టంగా ఉన్నా ఏదో ఇంత స్నానం చేసి దీపం వెలిగించి వస్తున్నాను.

జానకి ఈపాటికి రేవులోకి వెళ్లి వుంటుందా?' అని అడగాలనిపించింది.

కాని నాయనమ్మ మళ్లీ చెప్పటం మొదలెట్టింది. 'ఒరేయ్ రంగా! నా పదిహేనో ఏటినుంచి ఆ కృష్ణవిగ్రహం పూజచేస్తున్నారా. ఏవయినసరే నే పోయింతర్వాత ఆ విగ్రహం నువ్వు తీసికెళ్లి మీఇంట్లో పూజ చేయించాలి.

'అట్లాంటి మాటలనకు నాయ నమ్మా! నాకు పెళ్లి కావద్దా, నువ్వా మునిమనవల్ని చూడొద్దా....

'అహా....'అని చీకట్లో మెత్తగా నవ్వి పిచ్చినాయినా! నే నెవర్రా చూడ్డానికి. అదిగో అన్నీ వాడే చూస్తాడు' అంది ఆకాశంలో పొడుపు చుక్కని చూపిస్తూ.

ఇంతలో చింతచెట్ల దగ్గిరకొచ్చాం. కొంతమంది స్నానాలుచేసి దీపారాధ నలు చేస్తున్నారు. అందులో జానకి

కూడా వుండొచ్చనుకున్నాను. నువ్విక్కడ కూర్చోరా రంగా 'నే స్నానం చేసి వస్తా' అంటూ నాయనమ్మ నీళ్ళవైపు కెళ్ళింది. నేను సంవత్సరంక్రితం కూర్చున్న అదే బండరాయిమీద కూర్చుని చుట్టూ జానకి కోసం చూశాను. ఎక్కడా కనిపించలేదు. నాయనమ్మ స్నానంచేసి వచ్చింది. 'నాయనమ్మా! నాయనమ్మా!' అన్నాను. నాయనమ్మ దీపం వెలిగించుకుంటూ మాట్లాడలేదు. కాస్తాగి 'నాయనమ్మా! జానకి ఎక్కడా కన్పించదేం?' అన్నాను. నాయనమ్మ కొంచెం తుళ్లిపడింది.

'ఇంకెక్కడి జానకిరా తండ్రీ! మొన్న పురిట్లో దాన్ని దేవుడు తీసికెళ్ళాడు' అంది కళ్ళొత్తుకుంటూ.

నేను కుంగిపోయాను. నోటమాట రాలేదు. చీకటి నన్ను మింగుతున్నట్లుంది. నాయనమ్మ పెట్టిన దీపం చిటపట లాడుతోంది. చింతచెట్టుమీద కబోదిపక్షులు గావుకేకలు పెడ్తున్నాయి. నాయనమ్మ తనలో తను గొణుగుకుంటూ వెంకటేశ్వర స్తవం చదువుకుంటోంది.

దీపాలు కృష్ణలో విడిచి పెడ్తున్నారు. నేను యాంత్రికంగా నడిచి వెళ్ళి ఒడ్డున నుంచున్నాను. నీటిలో బడబానలం పొంగి నిప్పులు విరజిమ్మినట్లు నదిలో దీపాలు తేలాయి. కాలుతున్న చితి విరజిమ్మినట్లు కృష్ణలో కొరువులు మండుతున్నాయి. కృష్ణమ్మ కోపంతో విస్ఫులింగాలు రాల్చినట్లు దీపాలు ఈదుకుపోతున్నాయి. నాయనమ్మ ఒడ్డుకువస్తూ అడిగింది. 'ఏంరా రంగా! నా దీపం దేవుడి దగ్గిర కెళ్ళిందా?'

'లేదు మునిగిపోయింది' అన్నాను మెల్లిగా.

నడుస్తున్న నాయనమ్మ ఆగి పకాలున బోసినోరువిప్పి నవ్వి అదేరా పిచ్చి తండ్రీ! దేవుడి దగ్గర కెళ్ళటమంటే. అన్నీ దేవుడిదగ్గరకెళ్ళేవే. కొన్ని నువ్వు చూస్తుండగా వెళ్తాయి. కొన్ని దేవుడి దగ్గరకెళ్లటం నువ్వు చూడలేవు.' అంటూ గబగబా చింతచెట్లు దాటి నడిచిపోయింది.

నేను వెనక్కుతిరిగి కృష్ణవైపు చూశాను. ప్రత్యూషాన కృష్ణానది గలగలపాడే దివ్యసంగీతంలో మునిగిపోతున్న దీపికల రోదనం కలిసిపోతోంది. ★